సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం ၊ 17 ၊ మార్చి ၊ 2023



ఆమరణ దీక్షకు సిద్ధం

గ్రూప్–1 పరీక్ష రద్దు చేయకుంటే ఆమరణ దీక్షకు సిద్ధమని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸



నాణ్యతగా చేపట్టాలి

ప్రభుత్వ అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 29.2 /20.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణ కోసం రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు చేపటనున్నట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. నకిలీ విత్తనాలతో రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ సిబ్బందితో కలిసి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల తయారీదారుల పైనా, నిల్వ ఉంచే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా నకిలీ విత్తనాలు నిల్వ ఉంచే దుకాణాలను నిత్యం తనిఖీలు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసే విధంగా అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి విత్తనాల దుకాణాదారుడి దగ్గర తప్పక రశీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ అనిల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్, అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీలు టి.మహేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,555

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,576, కనిష్ఠంగా రూ.4,177 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,189, కనిష్ఠంగా రూ.2,169, పెబ్బర్లు రూ.4,639, కందులు గరిష్ఠంగా రూ.7,879, కనిష్ఠంగా రూ.7,699, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,520, కనిష్ఠంగా రూ.6,309, ధాన్యం హంస రకం రూ.1,629 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,324, కనిష్ఠంగా రూ.6,262గా నమోదయ్యాయి.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి



అడ్డాకుల: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని పాలించడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మూసాపేట మండలం నిజాలాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండా ప్రశాంత్‌రెడ్డితో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు అర్హులైన వారికి ఇంట్లో ఇద్దరికి పింఛన్ మంజూరు చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో ఒంద్రు మట్టి, ఇసుక దందాలు చేస్తూ ఇక్కడి ఎమ్మెల్యే అడ్డగోలుగా సంపాదించారని ఆరోపించారు. చెక్‌డ్యాం నిర్మాణాల్లో కమీషన్లు తీసుకుని అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో కొండా జగదీశ్వర్, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, సీజీ గోవర్ధన్, లక్ష్మినారాయణ, శ్రీహరి, వి.రాంచందర్, సురేష్, దేవన్న, రాములు ఉన్నారు.



మానవపాడు మండలం చెన్నిపాడులో నీటిని తొలగిస్తున్న రైతు

అకాల వర్షంతో అవస్థలు

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం
- వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మృతి

- 8లో..

'పోలేపల్లి' పరిశ్రమల కాలుష్యంపై నిశ్శబ్దం

- గత కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు
- ఉత్తుత్తి మాటలుగానే నెలనెలా తనిఖీలు
- విచారణ కమిటీ భేటీలో స్పష్టం చేసినా పడని అడుగు
- నూతన కలెక్టర్ రవినాయక్ దృష్టి సారించాలని రైతుల వేడుకోలు

● షరా మామూలే..

ష్.. గప్‌చుప్!



పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల నుంచి రైతుల పొలాల్లోకి వదిలిన కాలుష్య జలాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లాలోని జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ పరిధిలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై బాధిత రైతులు, ప్రజలు పోరుబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన అప్పటి కలెక్టర్ వెంకట్రావ్.. పదిమంది అధికారులతో విచారణ కమిటీ వేశారు. ఐదారు నెలలుగా దర్యాప్తు సాగిన అనంతరం.. ఎట్టకేలకు జనవరి 31న 'సెజ్ పరిసర ప్రాంతాలు కాలుష్యమయమయ్యాయి. ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. తాగేందుకు, పంటల సాగుకు, జీవచరాల ఉనికికి ఈ నీరు పనికిరాదు. దాదాపు ఏడు గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయి' అని ముక్తకంఠంతో వెల్లడిస్తూ ఎవరికి వారు నివేదికలు అందజేశారు. ఆ తర్వాత కలెక్టర్ ఈ నివేదికలను ఎన్జీటీతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చెందిన ఉన్నతస్థాయి అధికారులకు సమర్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటివరకు సదరు కంపెనీలపై ఇటు జిల్లా అధికార యంత్రాంగం గానీ, అటు హైదరాబాద్‌లోని పీసీబీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కాలుష్య బాధితుల గోడు అరణ్యరోదనగానే మిగిలిపోయింది.

మళ్లీ అ'న్యాయమే'నా..

పోలేపల్లి సెజ్ పరిధిలో ప్రధానంగా పలు ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను నేరుగా బయటకు వదులుతుండడంతో పంట పొలాల్లోకి చేరుతున్నాయని.. కుంటలు, చెరువు నీటిలో కలవడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని.. పంటలు పండని పరిస్థితి నెలకొందని.. రోగాలతో ఇబ్బందులు పడుతున్నామని బాధితులు అనేక ఏళ్లుగా అటు పీసీబీ, ఇటు జిల్లా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. బాధిత రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు అందినప్పుడల్లా పీసీబీ అధికారులు పరిశీలించడం.. ఆ తర్వాత రైతులు, ఆయా ఫ్యాక్టరీల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో సమావేశం కావడం ఆనవాయితీ వచ్చింది. పరిశ్రమల కాలుష్యానికి సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుదే నిర్ణయాధికారంగా వ్యవహారం సాగేది. అయితే ఈసారి కలెక్టర్ చొరవ తీసుకుని జిల్లా స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు పదిమందితో విచారణ కమిటీ వేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమూనాలు సేకరించాలని ఆదేశించారు. ఆయా శాఖలు నమూనాలను ల్యాబ్‌కు పంపించగా.. ఫలితాలు సైతం వచ్చాయి. జనవరి 31న విచారణ కమిటీతో జరిగిన సమావేశంలో సదరు అధికారులు పోలేపల్లి పరిసరాలు, దాదాపు ఏడు గ్రామాల్లో కాలుష్య ప్రభావం ఉందని వెల్లడించారు. గతంలో ఎప్పుడూ చోటుచేసుకోని విధంగా జిల్లాస్థాయిలో విచారణ కమిటీ వేయడం.. కాలుష్యం జరుగుతున్నట్లు వెల్లడించడంతో తమకు ఈసారి న్యాయం జరుగుతుందని రైతులు ఆశించారు. కానీ.. ఇంతలోనే కలెక్టర్ వెంకట్రావ్ సూర్యాపేటకు బదిలీ కావడం.. నూతనంగా వచ్చిన కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించకపోవడంతో వారు తమకు న్యాయం అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటకెక్కిన తనిఖీలు..

విచారణ కమిటీతో భేటీ సందర్భంగా అప్పటి కలెక్టర్ ప్రతినెలా 11వ తేదీన పొల్యూట్ అయిన ప్రాంతాల్లో విధిగా పర్యటించాలని అధికారులను ఆదేశించారు. ఆ రోజు సెలవు దినమైన పక్షంలో మరుసటి వర్కింగ్ డే రోజు సందర్శించి పరిశ్రమల ప్రతినిధులు, స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. కానీ రెండు నెలలు గడిచినా.. ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి పర్యటించిన పాపానపోలేదు. ఈ క్రమంలో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

2 శాఖలు మాత్రమే ఇచ్చాయంటున్నారు..

గతంలో ఒకసారి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాం. గత కలెక్టర్ విచారణకు ఆదేశించిన క్రమంలో ఆలస్యం జరుగుతుండంతో మరోసారి ఎన్జీటీలో కేసు వేశాం. జిల్లాస్థాయిలో విచారణ కమిటీ తుది సమావేశం ముగియగా.. పది శాఖల అధికారులు ఇచ్చిన రిపోర్టు కావాలని అధికారులను అడిగితే ఎవరూ స్పందించలేదు. దీంతో సమాచార హక్కుచట్టం కింద దరఖాస్తు చేసినా. నెల దాటిన తర్వాత ఇటీవల వచ్చింది. ఇందులో కావాల్సిన సమాచారం ఇవ్వలేదు. సెక్షన్ అధికారికి ఫోన్ చేసి కనుక్కుంటే రెండుశాఖలు మాత్రమే ఇచ్చాయని చెబుతున్నారు. అందరూ తప్పించుకుంటున్నారు. అయినా మేం పోరాడతాం. ఆ రిపోర్టులను ఎన్జీటీకి సమర్పిస్తాం.

– కోస్గి వెంకటయ్య

పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటా..

ఇటీవలే నా దృష్టికి వచ్చింది. కమిటీ రిపోర్టు ఇవ్వమని చెప్పాను. ఒక్కో అధికారి రిపోర్టు కూడా తెప్పించుకుంటున్నా. వాటిని పరిశీలించిన తర్వాత ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తాం. రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

– రవినాయక్, కలెక్టర్



మంత్రి నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చల్లా వెంకట్రామిరెడ్డి

నడిగడ్డకు 'తొలి' ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యే కోటాలో ఏకగ్రీవంగా ఎన్నికైన చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: నూతనంగా ఆవిర్భవించిన జోగుళాంబ గద్వాల జిల్లాలో తొలి ఎమ్మెల్సీ స్థానం బోణీ కొట్టింది. ఈ క్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు గురువారం ధ్రువపత్రం అందుకున్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల 7న ఎమ్మెల్యే కోటాలో ముగ్గురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అందులో దేశపతి శ్రీనివాస్, నవీన్‌కు మార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి పేర్లను ఖరారు చేయగా.. ఈ నెల 9న చల్లా నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే కోటా కింద నామినేషన్‌లు దాఖలు చేసిన వారిలో ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన చల్లా వెంకట్రామిరెడ్డి సీఎం కేసీఆర్, జిల్లాకు చెందిన మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన న్యాక్ బృందం పర్యటన



బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బొటానికల్ గార్డెన్ పరిశీలిస్తున్న న్యాక్ బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూజీసీ న్యాక్ బృందం పర్యటన గురువారం ముగిసింది. పర్యటనలో భాగంగా రెండోరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందం చైర్‌పర్సన్ రిచాచోప్రా, మెంబర్ కో ఆర్డినేటర్లు కైలాష్ అగర్వాల్, మరియా ఆంథోనిరాజ్ సమీక్షలు, సందర్శనలతో గడిపారు. ఎన్‌సీసీ విద్యార్థులతో ముఖాముఖి అయి పరేడ్‌ను తిలకించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కోఆర్డినేటర్లతోనూ సమావేశమై శిబిరాల నిర్వహణ, వలంటీర్లకు కలిగిన ప్రయోజనాల గురించి ఆరా తీశారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయో డైవర్సిటీ రీసెర్చ్‌ల్యాబ్‌ను సందర్శించి అక్కడ పరిశోధక విద్యార్థులతో మాట్లాడారు. ల్యాబ్, గార్డెన్ ప్రత్యేకతలను సదాశివయ్య వారికి వివరించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న మహిళా వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. భోజన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ప్రిన్సిపల్ చాంబర్‌లో ఆయా విభాగాల అధిపతులతో సమీక్ష జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ గూర్చి వివరాలు రాబట్టారు. బృందం పర్యటన మధ్యాహ్నానికే పూర్తికావాల్సిన ప్పటికీ సమీక్షలు, సమావేశాలతో సాయంత్రం వరకు కొనసాగింది. సాయంత్రం ముగింపు సందర్భంగా ఎగ్జిట్ సమావేశం జరిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులతో వారు మాట్లాడారు. కళాశాల పర్యటనలోని ముఖ్య అంశాలను మరోసారి గుర్తుకు చేసుకున్నారు. ఎగ్జిట్ సమావేశం అనంతరం బృందానికి ప్రిన్సిపల్, అధ్యాపకులు వీడ్కోలు పలికారు. గార్డెన్ సందర్శనలో బృందం సభ్యుల చిత్రాలతో కూడిన కార్వింగ్ వేయించిన పుచ్చకాయలను అందజేశారు. బృందం పర్యటన ఆసాంతం సంతృప్తిగానే కొనసాగినప్పటికీ ఒకట్రెండు అంశాల్లో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

రెండోరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా రెండోరోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు రెండో సంవత్సరం విద్యార్థులు లాంగ్వేజ్ పేపర్ 2 పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయగా.. 9,679 మంది పరీక్షలకు హాజరు కాగా.. 230 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో సాధారణ కోర్సుల వారు 7,860 మంది, ఒకేషనల్ కోర్సుల వారు 1,589 మంది ఉన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఐఈఓ వెంకటేశ్వర్లు జిల్లాకేంద్రంలోని 3 పరీక్ష కేంద్రాలు, మండలాల్లోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొదటి రోజు విద్యార్థులు ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నా.. రెండోరోజు ఎక్కడా ఆలస్యంగా రాలేదు.





మహబూబ్‌నగర్‌లో బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థినులు

టౌన్‌షిప్‌లలో మరింత అభివృద్ధి

- కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సారిక, పోతులమడుగు టౌన్‌షిప్‌లు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బాదం రామస్వామి ఆడిటోరియంలో అమిస్తాపూర్ వద్దనున్న సారిక, భూత్పూర్ మండలం పోతులమడుగు టౌన్ షిప్‌లలో ఖాళీ ప్లాట్లకు నిర్వహించిన బహిరంగవేలంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ రెండు టౌన్‌షిప్‌లలోని లేఔట్లు హెచ్ఎండీఏ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించారని తెలిపారు. ఈ ప్లాట్లు తీసుకున్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా అనతి కాలంలోనే బాగా అభివృద్ధి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మహబూబ్‌నగర్‌తో పాటు, చుట్టుపక్కల వారు కూడా బహిరంగవేలంలో పాల్గొని ప్లాట్లను తీసుకోవచ్చన్నారు. ఎవరైనా ప్లాట్ మొత్తాన్ని చెల్లిస్తే బ్యాంకు లోన్ కూడా తీసుకోవచ్చని, బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వేలం వద్దే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోతులమడుగు టౌన్‌షిప్‌కు నిర్వహించిన వేలం పాటలో ప్లాట్లు పొందిన వారికి ప్రొసీడింగ్‌లను అందజేశారు. అంతకుముందు గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వైద్యం భాస్కర్ మాట్లాడుతూ.. 17, 18 తేదీలలో కూడా బహిరంగ వేలం ఉంటుందన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇచ్చే రుణంపై ఎస్‌బీఐ నుంచి విశ్వనాథం వివరించారు. కార్యక్రమంలో హన్వాడ తహసీల్దార్ బక్కశ్రీనివాసులు, నవాబ్‌పేట తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శంకర్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాటు దక్కించుకున్న వ్యక్తికి ప్రొసీడింగ్ అందజేస్తున్న కలెక్టర్ రవినాయక్

సర్వే దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ధరణి, ప్రజావాణి, సర్వే దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ రవినాయక్ అన్నారు. తన చాంబర్ నుంచి తహసీల్దార్లతో వీసీ ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆదాయ, కులం ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని తహసీల్దార్లకు చెప్పారు. సర్వే కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా సర్వేను వేగవంతం చేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, 2022 డిసెంబర్ వరకు ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇకపై వచ్చేవారం నుంచి 2022 కేసులు సమీక్షించడం కుదరదని, వాటన్నింటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎంత పట్టుకున్నారు.. ఎంత జరిమానా విధించారో నివేదిక ఇవ్వాలని మైన్స్ ఏడీ విజయకుమార్‌ను ఆదేశించారు. ప్రజావాణి, సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. ఈ–ఆఫీస్‌లో ఇంకా 4,341 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంత గృహ లబ్ధిదారుల వివరాల అప్‌లోడ్ వేగవంతం చేయాలన్నారు.

పీయూ బంద్



పాలమూరు యూనివర్సిటీలో టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మహబూబ్‌నగర ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ గురువారం పాలమూరు యూనివర్సిటీ బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా పీయూ పరిధిలోని కళాశాలలను బంద్ చేయించి.. ఏబీవీపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంతో మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడం దుర్మార్గమని, ప్రభుత్వం బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శోభన్ రాథోడ్ డిమాండ్ చేశారు. లీకేజీ వ్యవహారం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. టీఎస్‌పీఎస్సీ, ప్రభుత్వం కుమ్మక్కై ఉద్యోగాలకు అమ్ముకోవడం ద్వారా రూ.కోట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆందోళనలో శివకుమార్, ప్రవీణ్, శరత్, అంజి, నీరేష్, సాయి, పవన్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రం లీక్‌కు బాధ్యత వహిస్తూ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలు భద్రపరిచిన కంప్యూటర్‌కు సంబంధించిన ఐడీ, పాస్‌వర్డ్‌లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతికి ఎలా వచ్చాయని, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నీటిసంపులో పడి రెండేళ్ల బాలిక మృతి


మైత్రిక (ఫైల్)

ఉప్పునుంతల: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి రెండేళ్ల బాలిక మృతిచెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం మండలంలోని లక్ష్మాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లం కృష్ణవేణి, బాలగౌడ్ దంపతులకు ఒక్కగానొక్క కూతురు మైత్రిక. ఇంటిపక్కనే పెళ్లి రిసెప్షన్ సందర్భంగా మధ్యాహ్నం తల్లిదండ్రులు భోజనం చేయడానికి వెళ్తూ చిన్నారిని ఇంట్లోనే అమ్మమ్మ వద్ద ఉంచారు. ఆడుకుంటూ వెళ్లి బాలిక సంపులో పడిపోయిన విషయం అమ్మమ్మ గమనించలేదు. కొద్ది సేపటికి వెతుకుతూ వెళ్లి చూడగా బాలిక నీటి తేలాడుతున్న విషయం గుర్తించి వెంటనే బయటకు తీసి నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

కొత్తకోట రూరల్: కూలీకి వెళ్లొస్తుండగా ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన పెద్దమందడి మండలం వెల్టూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్టూర్‌కు చెందిన యాదమ్మ(48) గ్రామానికి చెందిన మేస్త్రీ బాలస్వామి వద్ద రోజువారి కూలీ పనులకు వెళ్తుండేది. బుధవారం కూలీకి వెళ్లి, సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు మేస్త్రీ బాలస్వామి బైక్‌పై బయలుదేరింది. ఈ క్రమంలో మట్టి ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో యాదమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ శ్రీనుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధుడు మృతి



వనపర్తి క్రైం: అనుమానాస్పదంగా వృద్ధుడు చెరువులో పడి మృతిచెందిన సంఘటన గురువారం జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలో కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తున్న వెంకటయ్య (60) గోపాల్‌పేట రోడ్డులో ఉన్న నల్లచెరువులో శవమై తేలాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి విచారించగా వెంకటయ్య అని తెలిసిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఎవరికైనా పూర్తి వివరాలు తెలిస్తే పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని ఇద్దరి బలవన్మరణం


యాదగిరి (ఫైల్)

పెద్దకొత్తపల్లి: ప్రేమించిన అమ్మాయి కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మర్రికల్ చెందిన దాసరి యాదగిరి(23) అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయి కుటుంబసభ్యులు బుధవారం రాత్రి యాదగిరిని మందలించడంతో బుధవారం అర్ధరాత్రి తమ వ్యవసాయ పొలంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని అన్న దాసరి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

పుటాన్‌పల్లిలో వివాహిత..

గద్వాల క్రైం: మండలంలోని పుటాన్‌పల్లి చెందిన బోయసుజాత (30) భర్త వెంకటేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య మనస్పార్థాలు వచ్చాయి. బుధవారం రాత్రి ఇద్దరు గొడవ పడడంతో తీవ్ర మనస్తాపం చెందిన బోయసుజాత గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

గంజాయి మొక్కలు ధ్వంసం



మహబూబ్‌నగర్ క్రైం: పంట పొలంలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను అధికారులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ మండలంలోని ఇప్పలపల్లి శివారులోని గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ పాండు నాయక్, ఆర్‌ఐ క్రాంతికుమార్ కలిసి గురువారం దాడులు చేశారు. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. గంజాయి సాగు చేస్తున్న బంగారి బజార్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ వెల్లడించారు.

అకాల వర్షంతో అవస్థలు

- జలమయమైన మార్కెట్‌యార్డులు
- మరో రెండు రోజులు వర్ష సూచన


ధరూరులో వడగండ్లు చూపిస్తున్న బాలుడు


గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో తడుస్తున్న వేరుశనగ పంట

మహబూబ్‌నగర్ రూరల్/అలంపూర్/అచ్చంపేట రూరల్/బిజినేపల్లి/కల్వకుర్తి రూరల్/అడ్డాకుల/ధరూరు/మానవపాడు/శాంతినగర్/గోపాల్‌పేట: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్క సారిగా వాతావరణంలో మార్పు రావడంతో మబ్బులు కమ్ముకున్నాయి. లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరింది. అంతేకాకుండా మార్కెట్ యార్డులో ఉన్న వేరుశనగ, ఇతర పంటలు నీట మునిగి రైతులకు నష్టం మిగిల్చాయి. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉంచగా తడిసిపోయాయి. కొన్నిచోట్ల వడగండ్ల వాన పడింది.

■ అచ్చంపేట పట్టణంలో పెద్ద పెద్ద చినుకులు పడ్డాయి. ఉప్పునుంతల రోడ్డులో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ సమీపంలో కల్వర్టు వద్ద భారీ నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే వాహనాలకు అంతరాయం కలిగింది. మల్లకుంట వద్ద నీరు రోడ్డుపైకి వచ్చింది. చాలా కాలనీల్లోకి వరద నీరు రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

మండలంలోని సింగారం చెందిన రైతు ఆంజనేయులు మూడు ఎకరాల్లో పండించిన వేరుశనగ పంటను గురువారం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వర్షపు నీరు రావడంతో 4క్వింటాళ్ల వరకు ధాన్యం తడిసింది. బొమ్మన్‌పల్లికి చెందిన రైతు ఉస్సేన్ 2 ఎకరాల్లో పండించిన వేరుశనగ పంటను తీసుకురాగా తడిచిపోయింది. శుక్ర, శనివారాల్లో మార్కెట్‌కు ధాన్యం తీసుకరావద్దని అధికారులు చెప్పారు.

■ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు రాబోయే రెండు రోజుల పాటు కురుస్తాయని పాలెం కేవీకే వాతావరణ విభాగ శాస్త్రవేత్త లావణ్య గురువారం ప్రకటనలో తెలిపారు. రైతులు పిచికారీలు, రసాయన ఎరువుల వాడకం, నీటి తడులు ఇవ్వడం, చెట్ల కింద పశువులను లేకుండా చూడటం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం సాయంత్రం బిజినేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షాలు రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

■ కల్వకుర్తి పట్టణంలో గురువారం సాయంత్రం ముసురు వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ రైతులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ కార్యదర్శి భగవంత్ రైతులకు కవర్లను అందించారు.

■ అడ్డాకుల, మూసాపేట మండలాల్లో సుమారు గంట పాటు వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పొలాల్లో వర్షం నీరు నిలిచింది.

■ ధరూరు మండలంలో సాయంత్రం 6 గంటల నుంచి 6:30గంటల వరకు వడగండ్ల వాన కురిసింది. పంటలకు కొంత ఊరటనే అయినప్పటికీ ఇటుకల బట్టీల వారికి ఇబ్బందులు కలిగాయి. ఇటుకలను మూసివేయడానికి నానా తిప్పలు పడ్డారు. పత్తి సాగు చేసే రైతులు పొలాలను దున్నుకునేందుకు అనువుగా మారాయి.

■ అలంపూర్ నియోజకవర్గంలో అకాల వర్షం కురిసింది. మారిన వాతావరణంలో ఒక్కసారిగా ఆందోళనకు గురైన అన్నదాతలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కాపాడుకోవడానికి అవస్థలు పడ్డారు. అలంపూర్ చౌరస్తాలోని కొనుగోలు కేంద్రాల్లో వారం రోజులుగా కొనుగోళ్లు సక్రమంగా చేయడం లేదు. దీంతో వారం రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నారు. భారీగా ఈదరుగాలులు, మెరుపులు, ఉరుములతో వాన దంచికొట్టడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రైతుల కష్టాలను గుర్తించి త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

■ మానవపాడు మండలంలో కురిసిన వర్షానికి మిరప రైతులు ఇబ్బందులు పడ్డారు. పొలంలో నిలిచిన నీటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాగే వర్షం కురిస్తే ఇబ్బందులు వస్తాయని మిరప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ మహబూబ్‌నగర్‌లో సాయంత్రం తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసి కాస్త ఉపశమనం కలిగించింది. వాతావరణ శాఖ ముందుగా హెచ్చరించిన విధంగానే జిల్లాలో వర్షం తన ప్రభావం చూపింది. వర్షానికి మామిడి తోటలకు కొంతమేరకు నష్టం వాటిల్లింది. నవాబుపేట, జడ్చర్ల, బాలానగర్, మిడ్జిల్, రాజాపూర్, మూసాపేట, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ, గండేడ్, మహబూబ్‌నగర్ అర్బన్ మండలాల్లో వర్షం కురిసింది.

■ గురువారం మధ్యాహ్నం నుంచి వడ్డేపల్లి మండలంలో చిన్నపాటి వర్షం కురిసింది. ఆర్డీఎస్ ఆయకట్టు, బోరు బావుల కింద సాగుచేసిన మొక్కజొన్న, సీడుజొన్న, మినుముల పంటలు మరో 10 నుంచి 15 రోజులకు కోతకు వస్తాయని, ఇంతలో అకాల వర్షం ప్రారంభమమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో వడగండ్లు పడ్డాయి. రేవల్లిలో సైతం ఈదురుగాలులు వీస్తూ వర్షం కురిసింది.

■ కేటీదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం సాయంత్ర వడగండ్ల వర్షం రావడంతో పలు చోట్ల మామిడి తోటలు దెబ్బతిన్నాయి.


కేటీదొడ్డిలో కురుస్తున్న వర్షం


అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన వేరుశనగను సంచుల్లో నింపుతున్న రైతులు


అలంపూర్ చౌరస్తాలోని కేంద్రంలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు


కల్వకుర్తిలో వేరుశనగపై కవర్లు కప్పుతున్న రైతులు


ధరూరులో కురుస్తున్న వర్షం


అలంపూర్ చౌరస్తాలో కప్పిన ధాన్యంపై నిలిచిన వర్షపు నీరు

పశువులు ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్


నిందితులను చూపుతున్న పోలీసులు

- 8 మంది సభ్యుల్లో ఇద్దరు పరారీ

వనపర్తి క్రైం: రాత్రి వేళలో గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి స్టేజి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడినట్లు సీసీఎస్ సీఐ శ్రీనివాసులు గురువారం ఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని నంద్యాల జిల్లా పాణ్యం చెందిన శ్రీను, ఆంజనేయులు, కులయప్ప అన్నదమ్ముళ్లు. అదే జిల్లాకు చెందిన కర్ణాకర్, నరేష్, సొదయ్య, గద్వాల జిల్లాకు చెందిన రాఘవేందర్, రమేష్ జల్సాలకు అలవాటుపడి ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ముఖ్యులైన శ్రీను, కర్ణాకర్ స్నేహితులు. సులువుగా డబ్బులు సంపాదించాలని ప్రకాశం జిల్లాలోని పొదలి, దర్శి, కుంబం, బేస్తవారిపేట, తెలంగాణలో నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాలో దొంగతనాలకు పాల్పడ్డారు. మేకలు, గొర్రెలు అపహరించిన వాటిని తరలించేందుకు మినీ డీసీఎం వాడేవారు. అనంతరం పశువుల సంతలో విక్రయించి, సమానంగా పంచుకునేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 17న వీరు చిన్నంబావి మండలం పెద్దదగడ శివారులో గొర్రెలు, మేకలు దొంగతనం చేసేందుకు డీసీఎం నిలిపారు. మొదట శ్రీను, కర్ణాకర్ బైక్‌పై గ్రామంలో ప్రవేశించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న గొర్రెల మందను చూసి, అందరూ కలిసి 38 గొర్రెలను తీసుకెళ్లారు. అనంతరం నంద్యాల జిల్లా బనగానపల్లి పశువుల సంతలో రూ.లక్షా30వేలకు విక్రయించారు. గొర్రెల యజమాని శ్రీనివాసులు మరుసటి రోజు ఉదయం చూసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిఘా ఉంచిన సీసీఎస్ సీఐ శ్రీనివాసులు, చిన్నంబావి ఎస్‌ఐ మహ్మద్ అమ్జాద్ గురువారం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి స్టేజి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. డీసీఎంను నిలిపి తనిఖీ చేస్తుండగా 8మంది నిందితుల్లో ఇద్దరు పారిపోయారు. అనుమానం వచ్చి అక్కడున్న వారిని విచారించగా విషయం బయటకు వచ్చింది. ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు, మినీ డీసీఎం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇంజిన్‌లో మంటలు.. టిప్పర్ దగ్ధం

భూత్పూర్: మండలంలోని కొత్తూర్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఇంజిన్‌లో మంటలు రావడంతో టిప్పర్ దగ్ధమైంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట మండలం కొమ్మిరెడ్డిపల్లికి చెందిన టిప్పర్‌లో కర్వెన ప్రాజెక్టు నుంచి నల్లమట్టిని తరలిస్తున్నారు. ఈ గురువారం తెల్లవారుజామున డ్రైవర్‌కు నిద్రరావడంతో కొత్తూర్ సమీపంలో రహదారి పక్కన నిలిపాడు. అకస్మాత్తుగా ఇంజిన్ నుంచి మంటలు రావడం గమనించిన డ్రైవర్ రమేష్ యజమాని సత్యశీలారెడ్డికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక వాహనం వచ్చే లోపే టిప్పరు పూర్తిగా దగ్ధమైంది. యజమాని ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

గొర్రెల మందపై కుక్కల దాడి


గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి రమేష్

అమరచింత: గొర్రెల మందపై కుక్కలు దాడిచేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన కంకలి రవి తన గొర్రెల మందను శివారులోని రాంరెడ్డి వ్యవసాయ పొలంలో మేతకోసం తీసుకెళ్లాడు. బుధవారం రాత్రి 15 గొర్రెల చుట్టూ వల కట్టి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి కుక్కల దాడి చేసి వాటిని పీక్కు తిన్నాయి. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి సందర్శించారు. మృతి చెందిన గొర్రెలను పోస్టుమార్టం నిర్వహించినట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్షన్నర ఉంటుందని బాధితుడు వాపోయాడు.

పిడుగుపాటుకు ముగ్గురి బలి

- పెబ్బేరు, బిజినేపల్లిలో ఇద్దరు పశువుల కాపరులు, గట్టులో రైతు..


లక్ష్మి (ఫైల్)

పెబ్బేరు: గొర్రెల మేత కోసం కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చి పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా చిట్యాలకు చెందిన గొల్ల బాలయ్య, భార్య లక్ష్మి (45), కుమారుడు సందీప్‌తో కలిసి పెబ్బేరు మండలం పెంచికలపాడు శివారులోని కృష్ణానది తీరాన గొర్రెలను మేపుతుండగా కుమారుడు గొర్రెల మంద వద్ద ఉన్నాడు. చిన్నపాటి వర్షం వస్తున్న క్రమంలో బాలయ్య, లక్ష్మి ఇద్దరు కలిసి చెట్టుకింద మధ్యాహ్నం భోజనం చేస్తుండగా పిడుగు పడింది. వారిద్దరు సొమ్మసిల్లి పడిపోగా కాసేపటికి బాలయ్య లేచి భార్యను లేపగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు.

గొర్రెల కాపరి..


బాలకృష్ణ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని లింగసానిపల్లి చెందిన బాలకృష్ణ (22) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలకృష్ణ గురువారం గొర్రెలను మేపేందుకు వసంతాపూర్ వైపు బీడు పొలాల గుండా వెళ్లారు. వరి పొలంలోకి గొర్రెలు వెళ్లకుండా తోలుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడటంతో బాలకృష్ణ కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కాస్త దూరంలో గొర్రెలను తోలుతున్న మరో వ్యక్తి వెంటనే విషయం గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మృతుడికి తల్లితండ్రులు నీలమ్మ, లక్ష్మయ్య, ముగ్గురు అన్నలు ఉన్నారు.

గట్టు మండలంలో రైతు..

గట్టు: మండలంలోని ఆరగిద్దలో గురువారం సాయంత్రం పిడుగు పాటుకు రైతు చాకలి జమ్మన్న (38) మృతి చెందాడు. చాకలి జమ్మన్న తన భార్య పద్మతో కలసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం వర్షం కుస్తున్న తరుణంలో పొలం దగ్గర ఆరబెట్టిన పొగాకు తోరణాలకు కవర్లను కప్పేందుకు చాకలి జమ్మన్న వెళ్లాడు. అదే క్రమంలో పిడుగు పడడంతో జమ్మన్న కుప్పకులాడు. చుట్టుపక్కల రైతుల సాయంతో గ్రామంలోని వైద్యుడి వద్దకు తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కోనాపూర్‌లో తప్పిన ప్రమాదం

వంగూరు: మండలంలోని కోనాపూర్‌లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన పర్వతాలు ఇంటి ముందు ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం కాలేదు. చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

రాష్ట్రంలోనే కల్వకుర్తి ప్రథమ స్థానం


కల్వకుర్తిలోని కమ్యూనిటీ ఆస్పత్రి

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని కమ్యూనిటీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. గురువారం అన్ని సీహెచ్‌సీల వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఎంసీహెచ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ సూర్యశ్రీ ఈ విషయాన్ని కల్వకుర్తి వైద్యులకు తెలియజేశారు. ఆస్పత్రిలో మూడు నెలలుగా రికార్డు స్థాయిలో మొదటి కాన్పులో సాధారణ ప్రసవాలు పెరిగాయని అధికారులు గుర్తుచేశారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సలహాలు, సూచనలు చేస్తూ 72.8 శాతం సాధారణ ప్రసవాలు చేయగా.. 27.2 శాతం మాత్రమే సిజేరియన్లు నిర్వహించారని రాష్ట్ర ఉన్నతాధికారులు గైనకాలజిస్టు విజయ్‌కుమార్‌కు కితాబిచ్చారు. గైనకాలజిస్టుతోపాటు ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది సహకారంతో సాధారణ ప్రసవాలు పెంచగలిగామని సూపరింటెండెంట్ శివరాం తెలిపారు. ఈ నెలలో ఇప్పటికే 71 కాన్పులు చేయగా.. అందులో 45 సాధారణ ప్రసవాలు, 26 సిజేరియన్లు చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉందని, సిబ్బంది సహకారంతో మరిన్ని సాధారణ ప్రసవాలు పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లుగా వైద్యులు వివరించారు.

వంతెన నిర్మాణంతో తీరనున్న కష్టాలు


అప్పరాల-తిప్పడంపల్లి వంతెన పనులను పరిశీలిస్తున్న సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి

కొత్తకోట: మండలంలోని అప్పరాల శివారులో నూతనంగా నిర్మిస్తున్న అప్పరాల-తిప్పడంపల్లి వంతెన నిర్మాణ పనులను గురువారం సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డితో పాటు బీఆర్‌ఎస్ శ్రేణులు పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. రూ.5.20 కోట్లతో అప్పరాల, తిప్పడంపల్లి వంతన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఇటు కొత్తకోట, అటు ఆత్మకూర్ ప్రజలు వంతెన లేక ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని, ఈ వంతెన పూర్తి అయితే అప్పరాల మీదుగా తిప్పడంపల్లి, శ్రీరాంస్టేషన్, ఆరేపల్లి, కత్తెపల్లి, ఆత్మకూర్, గద్వాల తదితర ప్రాంతాలకు వెళ్లడానికి చాలా సులభతరం అవుతుందన్నారు. గతంలో సుమారు 40 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వచ్చేదని, ఇక్కడ నిర్మిస్తున్న వంతెన వల్ల 10 కిలోమీటర్లలోపే ఆత్మకూర్‌తో పాటు, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌లు చేరుకోవచ్చని సంతోషం వ్యక్తం చేశారు.

ఊట్కూరు సర్పంచ్ సస్పెన్షన్

- పంచాయతీ కార్యదర్శిపై వేటు


సర్పంచ్ అయ్యస్వామి

అలంపూర్: మండలంలోని ఉట్కూరు పంచాయతీ సర్పంచ్ అయ్యస్వామి, కార్యదర్శి కవితపై కలెక్టర్, అదనపు కలెక్టర్ వేర్వేరు ఉత్తర్వులలో సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి తెలిపారు. సర్పంచ్ అయ్యస్వామి తల్లి మద్దెల లింగమ్మ 2019 ఫిబ్రవరి 17వ తేదీన మృతి చెందినట్లు పేర్కొన్నారు. మద్దెల లింగమ్మ మృతి చెందినప్పటి నుంచి ఆమెకు ఆసరా పింఛన్ డబ్బును ప్రతి నెల ఏటీఎం ద్వారా చేసుకున్నట్లు గ్రామస్తులు 2023 ఫిబ్రవరి 14వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏపీఓ(పీ) గ్రామంలో విచారణ చేసినట్లు పేర్కొన్నారు. ఆసరా పింఛన్‌ను ప్రతి నెల ఏటీఎం ద్వారా డ్రా చేశారని నిర్ధారణ కావడంతో, 2018 పీఆర్ చట్టం ప్రకారం గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్న అయ్యస్వామి బాధ్యతలను విస్మరించి విధులపై నిర్లక్ష్యంగా వహించడంతో బాధ్యతల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిపై సీసీఏ రూల్స్ 1991 ప్రకారం కార్యదర్శిని కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ పంచాతీయ బాధ్యతలను మరోక కార్యదర్శికి అప్పగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ వ్యవహారంలో 2019లో విధులు నిర్వర్తించిన మరొక పంచాయతీ కార్యదర్శిపై శాఖపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

2 ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

తాడూరు: మండలంలోని మేడిపూరు దుందుభి వాగులో గురువారం రాత్రి 8 గంటల సమయంలో అక్రమంగా ఇసుకను జేసీబీ ద్వారా ట్రాక్టర్లకు ఎత్తి తరలిస్తున్న విషయాన్ని స్థానికులు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని జేసీబీతో పాటు రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆంజనేయులు, భాస్కర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● సంక్షేమంతో కూడిన అభివృద్ధే లక్ష్యం

ఐదవసారీ అదే దారి

రూ.2,79,279.27 కోట్లతో 2023-24 ఏపీ వార్షిక బడ్జెట్



మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్

మంచి చదువు, మంచి వైద్యం, మంచి ఆరోగ్యం, రైతుల్లో సంతోషం, నా అక్క చెల్లెమ్మల్లో సాధికారత, జోరైన పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. అసమానతలు తగ్గించి, పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ బడ్జెట్ ద్వారా మరో అడుగు ముందుకేశాం.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళలు, పిల్లల పథకాలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం	మొత్తం ఆదాయం
రూ.2,28,540.71 కోట్లు	రూ.31,061.04 కోట్లు	రూ.2,79,279.27 కోట్లు
కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.41,338.02 కోట్లు		
కేంద్ర గ్రాంట్లు రూ.46,834.64 కోట్లు	రెవెన్యూ లోటు రూ.22,316.70 కోట్లు	ద్రవ్య లోటు రూ.54,587.52 కోట్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచే అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీకి సమర్పించింది. జెండర్ బేస్డ్ బడ్జెట్ ద్వారా సమాజంలో సగం ఉన్న మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. పిల్లలకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం విశేషం. అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా వరుసగా ఐదోసారి రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,28,540.71 కోట్లుగా, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు బుగ్గన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,316.70 కోట్లు రెవెన్యూలోటు, రూ.54,587.52 కోట్లు ద్రవ్యలోటు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.77 శాతం, ద్రవ్యలోటు 1.54 శాతం ఉంటుందని, రెవెన్యూ ఆదాయం 2,06,224.01 కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇందులో కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.41,338.02 కోట్లు వస్తాయని, కేంద్రం నుంచి గ్రాంట్లరూపంలో రూ.46,834.64 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. రెవెన్యూ లోటుతో పాటు ద్రవ్య లోటును అదుపులో పెట్టే చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతకు ముందు ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశమై 2023-24 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

నవరత్నాలకు పెద్దపీట

ఎప్పటిలాగే మేనిఫెస్టోలోని నవరత్నాల పథకాల కొనసాగింపునకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలతో పాటు మైనారిటీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీ ఎత్తున నిధులు కేటాయించారు. మొత్తం మీద రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజానీకాన్ని సంతృప్తి పరిచే స్థాయిలో బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మరో పక్క వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో మౌలిక రంగాలకు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో ఎక్కడా దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకత ప్రదర్శించారు. ఏయే రంగాల్లో ఏయే పథకాలకు ఎన్ని నిధులు కేటాయించింది స్పష్టంగా వివరించారు. అవ్వా తాతల సామాజిక పెన్షన్లను వచ్చే ఏడాది జనవరిలో నెలకు 3 వేల రూపాయలు చేస్తామని ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పెన్షన్ కానుకకు ఏకంగా రూ.21,434 కోట్లు కేటాయించారు. నవరత్న పథకాల్లోని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తామని స్పష్టం చేసింది.

సచివాలయాలకు కేటాయింపులు: చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మత్స్యకారులు, దర్జీలు, చేనేత కార్మికులు, కాపులు, లాయర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు.. గ్రామ, పట్టణ సచివాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నేరుగా నగదు బదిలీచేసే 22 నవరత్నాల పథకాలకు బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయించారు. మహిళల పథకాలకు ప్రత్యేకంగా రూ.77,914.43 కోట్లు, పిల్లల పథకాలకు ప్రత్యేకంగా రూ.20,593.38 కోట్లు కేటాయించారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.38,605 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.20,005 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.6,929 కోట్లు, మైనారిటీ కాంపొనెంట్‌కు రూ.4,203 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి రూ.51,345 కోట్లు, సాధారణ విద్యా రంగానికి రూ.32,198 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,043 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.17,531 కోట్లు కేటాయించారు.

రైతుల సంక్షేమంపై శ్రద్ధ

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు కేటాయింపులు కొనసాగించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా జలవనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించారు. మన బడి నాడు-నేడు కార్యక్రమానికి రూ.3500 కోట్లు.. వైద్య ఆరోగ్య రంగంలో నాడు-నేడు కార్యక్రమానికి రూ.2214.21 కోట్లు కేటాయించారు. పేదల గృహ నిర్మాణాలకు రూ.6291.70 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంకు రూ.610 కోట్లు కేటాయించారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.6,546 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీకి రూ.2,400 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వానికి రూ.532 కోట్లు కేటాయించారు.

2022-23 సవరించిన అంచనాలు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2,40,509.34 కోట్లుగా ఉంటుందని ఆర్థిక మంత్రి బుగ్గన తెలిపారు. రెవెన్యూ వ్యయం రూ.2,05,555.95 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.16,846.69 కోట్లు అని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు రూ.29,107 కోట్లు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు అని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూలోటు 2.21% కాగా, ద్రవ్యలోటు 3.62 శాతంగా ఉందని పేర్కొన్నారు.

బడ్జెట్ స్వరూపం

రెవెన్యూ రాబడి	రూ.2,06,224.01 కోట్లు
ప్రజా రుణం	రూ.72,022.09 కోట్లు
రుణాల రికవరీ	రూ.56.32 కోట్లు
పబ్లిక్ అకౌంట్స్	రూ.976.85 కోట్లు
మొత్తం రాబడి	రూ.2,79,279.27
రెవెన్యూ వ్యయం	రూ.2,28,540.71 కోట్లు
మూల ధన వ్యయం	రూ.31,061.04 కోట్లు
రుణ చెల్లింపులు	రూ.18,411.42 కోట్లు
రుణాలు & అడ్వాన్స్	రూ.1,266.10 కోట్లు
మొత్తం వ్యయం	రూ.2,79,279.27 కోట్లు

సొంత సంస్థల్లోకి మళ్లిస్తున్నారు

- మార్గదర్శి.. మరో అగ్రిగోల్డ్, సహారా కాకముందే చర్యలు చేపట్టాం
- విచారణ 'పరిధి' అంశం పెండింగ్‌లో ఉండగా క్వాష్ పిటిషనా?
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ తన ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును సొంత సంస్థల్లోకి మళ్లిస్తోందని, అవి నష్టాల్లోకి వెళ్తే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్, సహారా మాదిరిగా కాకముందే జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నందున పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వానికి ఏ సంస్థ అయినా ఒకటేనని, అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడబోమని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని / దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అభ్యర్థిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను ఏపీలో కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటివరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీన్ని గురువారం విచారణకు చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ రెగ్యులర్ కేసులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. విచారణ 'పరిధి', కేసు మెరిట్ అంశాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

పునర్విభజన చట్టానికి విరుద్ధం

'మార్గదర్శి అక్రమాలపై 409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పదేళ్లకు పైగా శిక్ష పడే కేసులే. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ రిలీఫ్ కోరలేరు. ఒకట్రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. కేసులు నమోదైన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు ఇక్కడ అరెస్టులు చేయవద్దని కోరడం చట్ట విరుద్ధం. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు కూడా పలు తీర్పులను ఇచ్చింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు. 'పరిధి' అంశం తేలకుండానే మళ్లీ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం దర్యాప్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారని చెప్పారు. చిట్స్ పేర డబ్బులు సేకరించి ఉషాకిరణ్ లాంటి సంస్థల్లోకి మళ్లిస్తున్నారని తెలిపారు.

మరో రాష్ట్రానికి మార్చండి..

'మార్గదర్శి కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇక్కడి నుంచే బ్రాంచ్‌ల పర్యవేక్షణ జరుగుతుంది. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇక్కడే ఉంటారు. అందుకే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాం. దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి. ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా తనిఖీలు చేస్తున్నారు' అని సిద్ధార్థ లూత్రా పేర్కొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఓట్ల లెక్కింపు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకుంది. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగతా 4 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ నాలుగు స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. గురువారం ఓట్లు లెక్కించారు. శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి నర్తు రామారావు, కర్నూలు జిల్లా నుంచి మధుసూదన్, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు. ఈ నాలుగు స్థానాల్లోనూ సంఖ్యా బలం లేకపోయినా స్వతంత్రుల ముసుగులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. కాగా, 3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలు మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎస్.మంగమ్మ, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జోగుళాంబ సన్నిధిలో సీఎస్ శాంతికుమారి



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ బెక్కం శ్రీనివాస్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు బాలబ్రహ్మేశ్వరుడిని దర్శించి అక్కడ ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం జోగుళాంబ అమ్మవారికి చేసే దశవిధ హారతులను తిలకించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో కాసేపు లలితా పారాయణం చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేయగా, ఈవో, చైర్మన్‌లు వారికి అమ్మవారి జ్ఞాపికను ఇచ్చారు.

ఉత్తమ రిసెప్షనిస్ట్‌గా సురేష్‌బాబు ఎంపిక



మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర పోలీస్ అకాడమీ ఉత్తమ రిసెప్షనిస్ట్ ఫంక్షనల్ వర్టికల్ ఆఫీసర్-2023లో జిల్లాలోని మూసాపేట పోలీస్‌స్టేషన్ చెందిన రిసెప్షనిస్ట్ సురేష్‌బాబు ఎంపిక అయ్యారు. అతనికి రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య చేతులమీదుగా ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ నరసింహ అభినందించారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.లక్ష మాయం

వనపర్తి క్రైం: సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ లింకును క్లిక్ చేయడంతో ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌రావు సెల్‌ఫోన్‌కు ఈనెల 3న ఓ మెసేజ్ లింకు వచ్చింది. దాన్ని క్లిక్ చేయడంతో అతని బ్యాంకు ఖాతాలో రూ.లక్ష విత్ డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాలెన్స్ సరిచూసుకోగా అకౌంట్‌లో డబ్బులు లేవు. గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ఆమరణ దీక్షకు సర్వం సిద్ధం

- అరెస్టు భయంతోనే కవిత గైర్హాజరు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



తెలకపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తెలకపల్లి: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేయకుంటే ఆమరణ దీక్షకు సర్వం సిద్ధం చేశామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు జమిస్తాపూర్, కార్వంగ, నడిగడ్డ, తాళ్లపల్లి, గట్టిరాయిపాకుల, గౌతంపల్లి, పెద్దపల్లి, బొప్పల్లిలో బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేయడంపై టీఎస్‌పీఎస్సీ స్పందించకపోవడంతో శుక్రవారం ఆమరణ దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష రద్దయ్యే వరకు దీక్ష కొనసాగుతుందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ భయంతోనే ఈడీ విచారణకు హాజరు కాలేదని విమర్శించారు. ఎలాంటి తప్పు చేయకుంటే విచారణకు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. కవిత తప్పు చేసింది కాబట్టే తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఢిల్లీకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువత అయోమయంలో ఉంటే కేవలం ఒక వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురి కోసం ఢిల్లీకి వెళ్లడం ఎక్కడి న్యాయమని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులపై పాలకులకు ఎలాంటి బాధ్యత లేదని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నల్లమట్టి అక్రమ రవాణ, ఇసుక మాఫియా, గుండాయిజంతో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. గుడ్‌మార్నింగ్ నాగర్‌కర్నూల్ కార్యక్రమంలో పేదల కష్టాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఒక్కటి కూడా ఇక్కడ పంపిణీ కాలేదన్నారు. పెద్దపల్లి గ్రామంలో స్వచ్ఛందంగా 9 ఎకరాల భూమి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఇస్తే కుట్రపూరితంగా ఎమ్మెల్యే అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ యాత్ర జమిస్తాపూర్, కార్వంగ, నడిగడ్డ, తాళ్లపల్లి, గట్టురాయిపాకుల, గౌతంపల్లి, పెద్దపల్లిలో కొనసాగింది. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కుమార్, పృథ్వీరాజ్, శివశంకర్, రాములమ్మ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



మొక్కనాటి నీరుపోస్తున్న అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా

- అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా
- పదవ బెటాలియం పరిశీలన

ఎర్రవల్లిచౌరస్తా: అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదవ బెటాలియంను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. బెటాలియం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం హరితహారంలో భాగంగా కమాండెంట్ రామ్ ప్రకాష్‌తో కలిసి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అంతకు ముందు కమాండెంట్ పుష్పగుచ్ఛం అందించి ఆమెకు స్వాగతం పలికారు. అధికారులు, సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమాండెంట్‌లు సాంబశివరావు, అనిల్ కుమార్, ఆర్ఐలు, సిబ్బంది ఉన్నారు.

1,019 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో బుధవారం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 548, సమాంతర కాల్వ ద్వారా 97 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 600, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

చైర్మన్ పీఠం కోసం పైరవీలు

- ఈ నెల 28న ముగియనున్న పాలకమండలి పదవీకాలం
- పావులు కదుపుతున్న రెడ్డి, బీసీ సామాజిక వర్గాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయ పాలకమండలి పదవీకాలం ఈ నెల 28వ తేదీ నాటికి ముగుస్తుండటంతో రాజకీయ నిరుద్యోగులకు ఊపిరి పోసినట్లయ్యింది. ఈ సారి ఎలాగైనా చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు రెడ్డి, బీసీ సామాజిక వర్గాలు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఆర్థిక బలం ఉండి, ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయలేని కొంతమంది ఈ నామినేటడ్ పదవులు వరంగా నిలుస్తున్నాయనే వాదన లేకపోలేదు. మొక్కుబడిగా దేవదాయశాఖ పాలకమండలి కోసం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, సేవ చేయాలని భక్తులు కొండంత ఆశతో దరఖాస్తులు చేసుకున్నా, నియోజకవర్గ నేతను ఎవరైతే ప్రసన్నం చేసుకోగలుగుతారో వారికే పదవులు దక్కుతాయి.

పదవీకాలం ముగియకముందే ప్రయత్నాలు షురూ..

పాలక మండలి పదవీకాలం ముగియకముందే 15 రోజుల నుంచే చైర్మన్ గిరికి పోటీ మొదలైంది. ఓ నేత ఇప్పటికే దేవదాయశాఖ కమిషనర్‌ను కలిసి త్వరగా నోటిఫికేషన్ వేయాలని కోరారు.

మారుతున్న రాజకీయ వాతావరణం

అలంపూర్ నియోజకవర్గంలో తాజాగా మారుతున్న రాజకీయ సమీకరణల నేపథ్యంలో తెరచాటు ప్రయత్నాలను మొదలు పెట్టేశారు. దేవాదాయ శాఖ వారు ఆలయ పాలక మండలి కోసం నోటిఫికేషన్ వెలువరించి, నిబంధనల మేరకు విచారణ కోసం 40 రోజుల సమయం కేటాయించాల్సి ఉంటుంది. నానా తంటాలు పడి పదవి తెచ్చుకున్నా.. మళ్లీ డిసెంబర్‌లో ఎన్నికలు వస్తే ఈ పదవులు ఉంటాయో లేదోనని ఆశావాహులు భయందోళనకు గురవుతున్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

- వసతిగృహంలో ఊడిపడిన పైపెచ్చు

కందనూలు: జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో గురువారం ఉదయం పైకప్పు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో అక్కడ విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్ వెంటనే ఏఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పది రోజుల కిందనే వసతి గృహాన్ని తనిఖీ చేసి భవన స్థితిగతులను పరిశీలించామని చెప్పారు. ఆ సమయంలోనే పైకప్పు బలహీనంగా ఉండటంతో గదిలో ఉన్న విద్యార్థులను వేరే గదిలోకి తరలించామని తెలిపారు. గతంలో చదువుకుని వెళ్లిపోయిన విద్యార్థుల పాత పుస్తకాలు మాత్రమే గదిలో ఉన్నట్లు తెలిపారు. గదుల మరమ్మతు నిర్మాణానికి కావాల్సిన రూ.8లక్షలతో కలెక్టర్ ఆమోదంతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శికి ప్రతిపాదనను పంపనున్నట్లు తెలిపారు. బలహీనంగా ఉన్న బీసీ వసతి గృహాల మరమ్మతుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి త్వరలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం చోటు చేసుకున్న ఘటనలో ముందస్తుగా తనిఖీ చేసి మార్చడంతో విద్యార్థులు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిపారు. ఆయన వెంట ఏబీసీడీఓ శ్రీధర్, వార్డెన్ ఉన్నారు.



పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనిల్‌ప్రకాష్

లీకేజీల బాధ్యత ప్రభుత్వానిదే..

- సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉద్యోగ నియామక పరీక్షపత్రాల లీకేజీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. పకడ్బందీగా నియామక పరీక్షలను నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లోని ఆయన తన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్రంలో అర్హులందరికీ ఉద్యోగాలు దక్కుతాయన్న నమ్మకంతోనే ఎంతో మంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసి అమరులయ్యారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిందే ఉద్యోగాల కోసమని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్, పరీక్షల రద్దుతో లక్షల మంది నిరుద్యోగులు వేదనకు గురవుతున్నా సీఎం కేసీఆర్‌కు కనీసం చీమకుట్టినట్లైనా లేదన్నారు. కేసీఆర్ సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. ఆయనకు ఈడీ, కూతురు కవితపై బాధ తప్పితే తెలంగాణ బిడ్డలపై లేదన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ పరీక్షలు చేపట్టేంత వరకు అభ్యర్థులకు నెలకు రూ.5వేల చొప్పున పరిహారం ఇచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. సమస్యలేవి పట్టించుకోకుండా మంత్రి కేటీఆర్ ట్విట్టర్ మినిస్టర్‌గా మారాడని ఎద్దేవా చేశారు. లిక్కర్ కేసులో తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సుమిత్ర, కాంగ్రెస్ నాయకులు అర్థం రవి, తిమ్మాజిపేట పాండు పాల్గొన్నారు.